సాక్షి
ప్రకాశం

ఆదివారం । 16 । ఏప్రిల్ । 2023



హత్యాయత్నం కేసు ఛేదింపు

జరుగుమల్లి మండలం కెజిట్రగుంట గ్రామానికి చెందిన పెరుగు నాగేశ్వరరావుపై హత్యాయత్నం కేసులో నిందితులను అరెస్టు చేశారు. - 8లో..



అదుపు తప్పి ఆర్టీసీ బస్సు బోల్తా

అదుపు తప్పి ఆర్టీసీ బస్సు బోల్తా పడి 9 మందికి గాయాలైన ఘటన మండలంలోని వసుపుగల్లు వద్ద శనివారం జరిగింది. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40 /26

ఆకాశం నిర్మలంగా ఉంటుంది.
వాతావరణం పొడిగా ఉంటుంది.
మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది.



న్యూస్‌రీల్

మొబైల్ రేషన్ సప్లయర్లకు గుర్తింపు కార్డులు అందజేత



గుర్తింపు కార్డులు అందజేస్తున్న జేసీ

ఒంగోలు టౌన్: ప్రకాశం జిల్లా మొబైల్ రేషన్ సప్లయర్లకు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరావు గుర్తింపు కార్డులను అందజేశారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో రేషన్ వ్యాన్ల పెండింగ్‌లో ఉన్న రూ.39.23 లక్షల ఇన్సూరెన్స్ తాలూకు చెక్కును బ్యాంక్ ఆఫ్ బరోడాకు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్ఓ ఉదయ భాస్కర్, ఎండీయూ అధ్యక్షుడు సాయి మౌలాలి, నజీర్, జిల్లా కార్యదర్శి నాగార్జున తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎండీయూ నాయకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

24న డెలివరీ కాని పార్శిళ్లు వేలం

ఒంగోలు: ఆర్టీసీ కార్గో ఒంగోలు కౌంటర్లలో 60 రోజులుగా డెలివరీకాని పార్శిళ్లను ఆర్టీసీ కార్యాలయ ఉత్తర్వుల ప్రకారం ఈనెల వేలం వేయనున్నట్లు కార్గో ఏటీయం శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏటీఎం(సి), అకౌంట్స్ ఆఫీసర్, సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ కమిటీ సమక్షంలో వేలం వేస్తారన్నారు.

బతుకు వేటకు బ్రేక్

ఎగసి పడుతున్న అలలను దాటుకుంటూ...రేయింబవళ్లు కడలినే నమ్ముకొని జీవించే మత్స్యకారుల వేటకు కొంత విరామాన్ని ప్రభుత్వం ప్రకటించింది. ఏటా సముద్రంలో చేపలు గుడ్లుపెట్టే సమయం కావడంతో వాటిని సంరక్షించేందుకు 61 రోజుల పాటు వేటను నిషేధించింది. ఆ సమయంలో పనిలేక మత్స్యకారులు ఇబ్బంది పడకూడదని రూ.10 వేల మత్స్యకార భరోసాతో ఆదుకుంటోంది. అర్హులను ఎంపిక చేసేందుకు ఇప్పటికే గ్రామ సచివాలయాల వారీగా సర్వే చేపట్టింది.

- 61 రోజుల పాటు సముద్రంలో వేట నిషేధం
- మత్స్యసంపద సంతానోత్పత్తి దశలో రక్షణకు ఆదేశాలు
- పునరుత్పత్తి, సంరక్షణ, పెంపుదలకు సహకారం
- సంప్రదాయ పడవల్లో మాత్రమే నిబంధనల మేరకు వేటకు అవకాశం
- నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన మత్స్యకారులపై చర్యలు
- వేట విరామ సమయంలో మత్స్యకారులకు రూ.10 వేలు వేట నిషేధ భృతి



వలలు ఇళ్లకు చేర్చుకుంటున్న మత్స్యకారులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

మత్స్య సంపద పెంపు లక్ష్యంగా ప్రభుత్వం సముద్రంలో రెండు నెలలపాటు వేట నిషేధాన్ని విధించింది. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు ఈ వేట నిషేధ సమయంగా ప్రకటించారు. సముద్రంలో మత్స్య సంపదను కాపాడేందుకు ఈ నిషేధాన్ని విధించినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. సముద్రంలో రొయ్యలు, చేపలు, పీతలులాంటి జీవులకు ఏప్రిల్ రెండో వారం చివరి నుంచి మే నెల, జూన్ రెండో వారం చివరి వరకు సంతానోత్పత్తి దశగా గుర్తించిన ప్రభుత్వాలు ఆ సమయంలో వేట సాగిస్తే అవి వలల్లో చిక్కుకొంటాయని భావించి ఈ నిషేధాన్ని విధించాయి. రెండు నెలలపాటు వేట నిషేధాన్ని విధిస్తే ఆ తరువాత ఏడాదిపాటు మత్స్యకారులకు సంపద దండిగా లభిస్తుంది. వేట నిషేధ సమయంలో మరబోట్లతో వేటకు వెళితే ప్రభుత్వం చట్టరీత్యా చర్యలు తీసుకుంటారు. అయితే సంప్రదాయ కర్రతెప్పలు మాత్రం ప్రభుత్వం నిర్ణయించిన వలల కన్ను సైజుతో 8 నాటికల్ మైళ్ల వరకు వెళ్లి వేట సాగించుకోవచ్చు.

మత్స్యకారులను ఆదుకుంటున్న ప్రభుత్వం:

ఈ నిషేధ సమయంలో మత్స్యకారులు ఉపాధి కోల్పోనున్న తరుణంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వారిని వైఎస్సార్ మత్స్యకార బరోసాతో ఆదుకుంటోంది. దీంతో పాటు అనేక రాయితీలను కూడా అందిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వం మత్స్యకారులను నమ్మించి నిలువునా మోసం చేసింది. వేట నిషేధ సమయంలో ఆదుకుంటామని చెప్పి మత్స్యకార భృతి ఇస్తామని చెప్పి వాస్తవమైన మత్స్యకార లబ్ధిదారులను కూడా ఆయా జాబితాల నుంచి తొలగించి నిలువునా మోసం చేసింది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వాస్తవమైన లబ్ధిదారులను గుర్తించి వాళ్లను అర్హుల జాబితాలో చేర్చింది. అప్పటి నుంచి అరకొరగా ఉన్న భృతిని పెంచుకుంటూ పోయింది. వేట నిషేధ సమయంలో గతంలో రూ.4 వేలు ఉన్న భృతిని ఒక్కో మత్స్యకారునికి రూ.10 వేలకు పెంచి ఇస్తూ ఆదుకుంటోంది. దీంతో మత్స్యకారులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు.

గ్రామాల్లో సర్వే....

ప్రభుత్వం నిర్ణయించిన విధివిధానాల మేరకు వైఎస్సార్ మత్స్యకార భరోసా పొందేందుకు అర్హుల ప్రక్రియను ప్రారంభించారు. సముద్ర తీరం వెంబడి జీవిస్తూ సముద్రంలో చేపల వేటే జీవనంగా సాగిస్తున్న వారి గురించి గ్రామ సచివాలయాల వారీగా సర్వే చేపట్టారు. గ్రామాల వారీగా బోట్ల వివరాలు సర్వే చేసి ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. 18 మీటర్లకుపైన పొడవు ఉండే మెకనైజ్డ్ బోట్లకు యజమాని కాకుండా 10 మంది, 18 మీటర్ల లోపులో ఉండే మోటరైజ్డ్ బోట్లకు యజమాని కాకుండా ఎనిమిది మంది, ఇతర మోటరైజ్డ్ బోట్లకు యజమానితో కలిపి ఆరుగురు, సంప్రదాయ, నాన్ మోటరైజ్డ్ బోట్లకు యజమానితో సహా ముగ్గురు చొప్పున అర్హులుగా గుర్తిస్తారు. వయస్సు 18–60 సంవత్సరాల లోపు ఉండాలి. వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, అర్బన్ ప్రాంతాల్లో రూ.11.44 లక్షలలోపు ఉండాలి. ఇతర ప్రభుత్వ నిబంధనలు కూడా కొన్నింటిని పరిగణలోకి తీసుకుంటారు.

జిల్లాలో 7,695 మంది మత్స్యకారులు:

జిల్లాలోని తీర ప్రాంత మండలాల్లో మొత్తం 7,695 మంది మత్స్యకారులు సముద్రంపై వేట సాగిస్తూ జీవనం సాగిస్తున్నారు. జిల్లాల విభజన తరువాత ఐదు మండలాలు బాపట్లకు, రెండు మండలాలు నెల్లూరు జిల్లాలకు వెళ్లిపోయాయి. మిగతా మండలాలు నాగులుప్పలపాడు, ఒంగోలు, కొత్తపట్నం, టంగుటూరు, జరుగుమల్లి, సింగరాయకొండ మండలాలు ఉన్నాయి. గతంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు 102 కిలో మీటర్ల సముద్ర తీరం ఉంటే అది కాస్తా ప్రస్తుతం 52 కిలోమీటర్లకు కుంచించుకుపోయింది. విభజించిన ప్రకాశం జిల్లాలో ప్రస్తుతం మెకనైజ్డ్ బోట్లు లేవు. మోటరైజ్డ్ బోట్లు జిల్లాలో 1089, సంప్రదాయ కర్రతెప్పలు 387 ఉన్నాయి. మెకనైజ్డ్ బోట్లలో సముద్రంలో నిరంతరం వేట సాగించే మత్స్యకారులు 6534 మంది, కర్రతెప్పల్లో వేట సాగించే మత్స్యకారులు 1161 మంది ఉన్నారు. మొత్తం కలిపి జిల్లాలో 7695 మంది మత్స్యకారులు సమద్రంపై వేట సాగిస్తూ జీవనం సాగిస్తున్నారు.

నిషేధం పారదర్శకంగా అమలు



సముద్రంలో చేపల వేట నిషేధాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నాం. వేట నిషేధ సమయంలో వేటకు వెళితే పునరుత్పత్తి అయ్యే మత్స్య సంపదకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయో వివరిస్తున్నాం. మత్స్య సంపదను వృద్ధి చేసేందుకు ప్రభుత్వం విధించిన నిషేధం గురించి అవగాహన కల్పిస్తున్నాం. మత్స్యకారులకు మంజూరైన సంక్షేమ పథకాల గురించి విశదీకరిస్తూ, వాటిని పారదర్శకంగా అమలు చేస్తున్నాం. వేట నిషేధాన్ని అతిక్రమిస్తే నిబంధనల ప్రకారం ఒక్కొక్కరికి రూ.5 వేలు జరిమానా కూడా విధించవచ్చు. జరిమానాతో పాటు బోటు రిజిస్ట్రేషన్‌ను కూడా ఏడాది పాటు రద్దు చేయవచ్చు.

– ఆవుల చంద్రశేఖరరెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి, ప్రకాశం జిల్లా

మత్స్యకార భరోసాతోనే కుటుంబం గడుస్తుంది



జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తరువాత మత్స్యకారులకు భరోసా ఇచ్చారు. వేట విరామ సమయంలో రూ.10 వేలు ఇస్తున్నారు. రెండు నెలల పాటు ఇబ్బంది లేకుండా గడుస్తుంది. డీజిల్ ఆయిల్ సబ్సిడీ కూడా ఇస్తున్నారు. వేట సమయంలో ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు బీమా సౌకర్యం కల్పిస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– పొన్నపూడి మస్తాన్, మడనూరు



కొత్తపట్నం తీరానికి చేర్చుకున్న బోట్లు



రథోత్సవంలో లక్ష్మీ చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులు



రథోత్సవానికి తరలివచ్చిన అశేష జనవాహినిలో ఒక భాగం

కదిలొచ్చిన దేవదేవుడు

- లక్ష్మీ చెన్నకేశవస్వామి రథోత్సవాన్ని తిలకించిన లక్షలాది మంది భక్తులు
- జై చెన్నకేశవ నామస్మరణతో ముందుకు సాగిన రథం

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేతుడైన లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి రథోత్సవం శనివారం సాయంత్రం అశేష జనవాహిని మధ్య కన్నుల పండువగా జరిగింది. వేలాదిగా భక్తులు స్వామి వారి రథోత్సవంలో పాల్గొన్నారు. రథయాత్రలో పాల్గొన్న భక్తులు జై చెన్నకేశవ... జై జై చెన్నకేశవా..... గోవిందా నామస్మరణలతో స్వామి వారిని దర్శించుకుని రథచక్రాలకు టెంకాయలు, గుమ్మడికాయలను కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. రథం బయలు దేరినప్పటి నుంచి మళ్లీ తిరిగి యథాస్థానం చేరే వరకు భక్తులు పోటీపడి రథాన్ని ముందుకు లాగి తమ భక్తిని చాటుకున్నారు. పట్టణంతో పాటు, వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వేలాదిగా పాల్గొని స్వామి వారి రథోత్సవాన్ని తిలకించారు. రథోత్సవానికి ఉభయదాతగా చిక్‌మంగళూరుకు చెందిన మోదాల చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు మోదాల వెంకట్రామయ్య వ్యవహరించారు. దర్శనానికి వచ్చిన మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డితో పాటు ప్రముఖులకు దేవస్థానం పాలక మండలి అధ్యక్షుడు పీ.కేశవరావు, ఈఓ శ్రీనివాసరెడ్డి ఘన స్వాగతం పలికారు. సాయంత్రం రథయాత్ర ప్రారంభమై మెయిన్‌బజార్, పాత బస్టాండ్, నాయుడు వీధి మీదుగా యథాస్థానానికి చేరింది. సాయంత్రం 4 గంటల నుంచే పట్టణానికి వేలాది మంది భక్తుల రాక మొదలైంది. జెండా ఊపి రథోత్సవాన్ని అధికారులు, పాలకమండలి సభ్యులు ప్రారంభించారు.

భద్రత ఏర్పాట్లు

పట్టణంలో రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో సీఐ ఆంజనేయరెడ్డి, ఎస్సైలు సుబ్బరాజు, సుమన్‌తో పాటు, కానిస్టేబుల్స్, స్పెషల్‌పార్టీల పోలీసులు భద్రత ఏర్పాట్లు పర్యవేక్షించారు.



రథం లాగుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



రథం ముందు ఎమ్మెల్యే అన్నా రాంబాబు



రథోత్సవంలో పాల్గొన్న జంకె వెంకటరెడ్డి

విద్యార్థుల ఉజ్వల భవితకు కృషి



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్

గిద్దలూరు రూరల్/బేస్తవారిపేట/కంభం: రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో అనేక మార్పులు తీసుకొచ్చిందని, విద్యార్థుల ఉజ్వల భవిత కోసం అహర్నిశలు శ్రమిస్తున్నామని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. జిల్లాలో శనివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. గిద్దలూరు, బేస్తవారిపేట, కంభం మండలాల్లో పాఠశాలలు, కేజీబీవీని ఆకస్మిక తనిఖీ చేశారు. గిద్దలూరు జెడ్పీ హైస్కూల్లో నాడు–నేడు కింద నూతనంగా నిర్మించిన భవన సముదాయాలు, మరుగుదొడ్లను, మధ్యాహ్న భోజన గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులతో మాట్లాడారు. పాఠశాలలో పదో తరగతి చదువుతూ మధ్యలో చదువు మానేసిన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి పాఠశాలను ఎందుకు మానేశారో అని విద్యార్థులను విచారించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్లి వారి స్టడీ మెటీరియల్ పుస్తకాలను పరిశీలించారు. న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి అవకతవకలు లేకుండా విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేశామని చెప్పారు. బేస్తవారిపేట కస్తూరిబా గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన ఆయన పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం వాడే కూరగాయలు, అరటిపండ్లు, గుడ్లను పరిశీలించారు. ఇంటర్మీడియెట్ తరగతి గదుల నిర్మాణానికి స్థలం కేటాయించాలని పాఠశాల ప్రిన్సిపాల్ సత్యవతి కోరారు. సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ కే శాంతిని ఆదేశించారు. పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కంభంలోని నాయక్ వీధిలో ఉన్న ఉర్దూ ప్రాథమిక పాఠశాలను కూడా ప్రవీణ్ ప్రకాష్ తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులు, పరిసరాలు పరిశీలించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంతకు ముందు స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలు పరిశీలించారు. ఆయన వెంట సబ్‌కలెక్టర్ సేథు మాధవన్, ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు, డీఈఓ పీ రమేష్, మార్కాపురం సబ్‌కలెక్టర్ సేథుమాధవన్, డిప్యూటీ డీఈఓ చంద్రమౌలీశ్వర్, తహశీల్దార్లు రమాదేవి, కె.శాంతి, కమిషనర్ వై.రామకృష్ణయ్య, ఎంఈవోలు నరసింహారావు, జింకా వెంకటేశ్వర్లు, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.



గిద్దలూరులో విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ప్రవీణ్ ప్రకాష్

క్లుప్తంగా

గుర్తు తెలియని వృద్ధురాలు మృతి


రైల్వేట్రాక్‌పై పడి ఉన్న వృద్ధురాలి మృతదేహం

ఒంగోలు టౌన్: ఒంగోలు–కరవది రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు ఢీకొని వృద్ధురాలు మృతి చెందింది. రైల్వే పోలీసులు మృతదేహాన్ని గుర్తించారు. మృతురాలి వయసు 70 ఏళ్లు ఉంటాయని తెలిపారు. మృతురాలి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. జీఆర్పీ ఎస్సై పి.వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు 9440627647 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

సింగరాయకొండ: ఆర్టీసీ బస్సు, మోపెడ్ ఢీకొన్న ఘటనలో వృద్ధుడు చొప్పర బాలకోటయ్య(75) మృతి చెందాడు. ఈ ఘటన శనివారం ఉదయం మండల పరిధిలోని కందుకూరు రహదారిలో కనుమళ్ల పంచాయతీ చిన్న కనుమళ్ల వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..ఒంగోలు నుంచి కందుకూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు మోపెడ్‌పై వెళ్తున్న చిన్న కనుమళ్లకు చెందిన వృద్ధుడు బాలకోటయ్యను ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఫిరోజ్‌ఫాతిమా తెలిపారు.

భూసేకరణను వేగవంతం చేయాలి


ప్రతిపాదిత స్థలాల్లో మ్యాప్‌ను, స్థలాలను పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

ఒంగోలు: భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. ఒంగోలు శివారు ప్రాంతాల్లో ఇళ్ల కేటాయించేందుకు గుర్తించిన ఎస్.అగ్రహారం, మల్లేశ్వరపురం, వెంగముక్కపాలెం, యరజర్లలోని ప్రతిపాదిత 508 ఎకరాల భూములను రెవెన్యూ అధికారులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం తన ఛాంబరులో సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. భూసేకరణ ప్రక్రియలో పురోగతిని అడిగి తెలుసుకున్నారు. మిగితా పనులు కూడా వేగవంతం చేయాలని స్పష్టంచేశారు. అప్రోచ్, ఇంటర్నల్ రోడ్లు, పార్కింగ్ తదితర సదుపాయాలతో కూడిన సమగ్ర లేఅవుట్‌ను రూపొందించాలన్నారు. జేసీ వెంట ఒంగోలు ఆర్డీఓ విశ్వేశ్వరరావు, హౌసింగ్ పీడీ పేరయ్య, ఒడా వైస్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ మురళి పాల్గొన్నారు.

17న అండర్–23 క్రికెట్ జట్ల ఎంపిక

మేదరమెట్ల: బాపట్ల జిల్లా కొరిశపాడు మండలంలోని రావినూతల గ్రామంలో గల ఆర్ఎస్‌సీపీ స్టేడియంలో ఈనెల 17వ తేదీ ఉదయం 9 గంటలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్–2, సీనియర్ క్రికెట్ జట్ల ఎంపిక నిర్వహిస్తామని పీడీసీఏ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి క్రీడాకారుడు తెలుపు జెర్సీలతో పాటు పుట్టిన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో హాజరు కావాలన్నారు. అండర్–23 క్రీడాకారులు 01-09-2000 తరువాత జన్మించి ఉండాలన్నారు. ఎంపికైన జట్లు ఏప్రిల్ 21వ తేదీ నుంచి కృష్ణాజిల్లా మూలపాడు క్రికెట్ గ్రౌండ్స్‌లో జరిగే ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల పోటీల్లో టీ–20, వన్‌డే మ్యాచ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాల కోసం పీ.శ్రీనివాస్, 95734 24360, బీ.శ్రీనివాసరావు 98495 29919 నెంబర్లలో సంప్రదించాలని అసోసియేషన్ కార్యదర్శి కోరారు.

సార్వభౌమునిగా చెన్నకేశవుడు


గజ వాహనంపై సార్వభౌమునిగా చెన్నకేశవ స్వామి


స్వామి నగరోత్సవంలో ఎమ్మెల్యే అన్నా రాంబాబు


స్వామి గజ వాహనం వద్ద ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున గజోత్సవంపై సార్వభౌమ అలంకారంలో చెన్నకేశవస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, అర్చక బృందం ప్రత్యేక పూజలు చేశారు.

చెన్నకేశవస్వామి పుష్పాలంకారాలతో, విద్యుద్దీపకాంతుల మధ్య గజవాహనంపై స్వామికి ఊరేగింపు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నగరోత్సవంలో ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు, ఎమ్మెల్యే కేపీ సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, ఆలయ ఈఓ జి.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ పి.కేశవరావు, యక్కలి కాశీవిశ్వనాథం, దొడ్డా భాగ్యలక్ష్మి, ధర్మకర్తలు, ప్రముఖులు, భక్తులు, ఉభయదాతలు పాల్గొన్నారు. ఉత్సవమూర్తుల ముందు నిర్వహించిన నృత్యాలు, వేషధారణలు, కోలాటం, ఆకట్టుకున్నాయి.

హత్యాయత్నం కేసు ఛేదింపు

- నిందితుల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఒంగోలు డీఎస్పీ నాగరాజు

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట గ్రామానికి చెందిన పెరుగు నాగేశ్వరరావుపై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితులను శనివారం అరెస్టు చేసి కేసును ఛేదించినట్లు ఒంగోలు డీఎస్పీ ఉప్పుటూరి నాగరాజు తెలిపారు. స్థానిక సీఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. కె.బిట్రగుంట గ్రామానికి చెందిన పెరుగు నాగేశ్వరరావు, కుంచాల ఉమామహేశ్వరరావు మధ్య చాలా సంవత్సరాలుగా స్థల వివాదం ఉంది. దీంతో నాగేశ్వరరావుపై కక్ష కట్టిన ఉమామహేశ్వరరావు అదే గ్రామానికి చెందిన దేపూరి పవన్ కుమార్, సింగరాయకొండ మండలం సోమరాజుపల్లి పంచాయతీ పకీరుపాలేనికి చెందిన రామలింగం వెంకటేశ్వరరావు, మరో మైనర్ బాలుడితో కలిపి ఒక్కొక్కరికి లక్ష రూపాయలు ఇచ్చేలా మాట్లాడుకుని హత్యకు ప్లాన్ చేశాడు. అందరూ కలిసి నెల రోజులు రెక్కీ నిర్వహించారు. ఈ నెల 12వ తేదీ రాత్రి గ్రామానికి సమీపంలో జాతీయ రహదారి పక్కనున్న భారత్ పెట్రోలు బంకు వద్ద గల పశువులను కట్టేసే షెడ్డు వద్దకు నాగేశ్వరరావు ఆవులను తోలుకుని వెళ్తుండగా కాపుకాచి దాడి చేశారు. ఇద్దరు యువకులు నాగేశ్వరరావు కాళ్లు ఒడిసి పట్టుకోగా, మిగిలిన ఇద్దరు తమ వెంట తెచ్చుకున్న ప్లాస్టిక్ తాడును అతని మెడకు బిగించి హత్య చేయబోయారు. నాగేశ్వరరావు పెనుగులాడి బిగ్గరగా అరవడంతో చుట్టుపక్కల ప్రజలు రాగా, నిందితులు నలుగురూ పారిపోయారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న సీఐ దాచేపల్లి రంగనాథ్ పోలీసులతో కలిసి అతి కొద్ది సమయంలోనే కేసును ఛేదించారు. శనివారం నిందితులు నలుగురినీ జీవీఆర్ ఆక్వా కంపెనీ వద్ద అరెస్టు చేశారు. కోర్టుకు హాజరుపరచనున్నట్లు డీఎస్పీ వివరించారు. కేసును ఛేదించిన సీఐ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. మీడియా సమావేశంలో జరుగుమల్లి ఎస్సై వి.వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్లు శ్రీను, మహేష్ పాల్గొన్నారు.

జిల్లాలో 2445 విద్యుత్ చౌర్యం కేసులు

- అపరాధ రుసుం కింద రూ.2,61,29,402 వసూలు
- ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలను కూడా పట్టుకొని సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన విద్యుత్ విజిలెన్స్ సీఐ అజయ్‌కుమార్

ఒంగోలు సబర్బన్: జిల్లా వ్యాప్తంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై 2445 కేసులు నమోదు చేసి అపరాధ రుసుం వసూలు చేసినట్లు విద్యుత్ విజిలెన్స్ సీఐ టీఎక్స్ అజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం విడుదల చేసిన ప్రకటనలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఏపీసీపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారి వద్ద నుంచి రూ.2,61,29,402 వసూలు చేసినట్లు పేర్కొన్నారు. నేరం చేసిన వారిని కోర్టులకు రప్పించి కాంపౌండింగ్ రూపంలో రూ.47,86,000 వసూలు చేసినట్లు కూడా పేర్కొన్నారు. జిల్లాలో విపరీతంగా అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు జరిగాయన్నారు. స్థానిక పోలీసుల సాయంతో విద్యుత్ పరివర్తకాలను ధ్వంసం చేసి రాగి తీగలను దొంగిలించిన ముఠాలను పట్టుకున్నామని తెలిపారు. దోర్నాల ఏరియాలో 15 మంది నిందితులను పట్టుకొని వారి వద్ద నుంచి మొత్తం రూ.6 లక్షల విలువైన 320 కేజీల కాపర్ వైరును రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 217 కేసులు పరిశోధనలు చేసినట్లు చెప్పారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుకు ప్రమాదం

- 9 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలు


ప్రమాదానికి గురైన బస్సు

టంగుటూరు: డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురై 9 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. మండలంలోని సూరారెడ్డిపాలెం సమీపంలో జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన రమేష్ ట్రావెల్స్ బస్సు హైదరాబాదు నుంచి ప్రయాణికులతో కందుకూరు బయలుదేరింది. ప్రయాణికుల్లో ఎక్కువ మంది ఒంగోలులో దిగారు. మిలిగిన 9 మందితో తెల్లవారుజామున సూరారెడ్డిపాలెం సమీపంలోకి రాగానే డ్రైవర్ నిద్రమత్తు కారణంగా బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న దిమ్మెని ఢీకొని ఆగింది. ఈ ప్రమాదంలో బస్సులోని 9 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న జాతీయ రహదారి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రయాణికులను సురక్షితంగా వేరే వాహనాల్లో గమ్యస్థానాలకు పంపించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

19న ఉచిత లివర్ స్క్రీనింగ్ క్యాంపు

ఒంగోలు టౌన్: ప్రపంచ లివర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని సుందరయ్యభవన్ రోడ్డులో ఉన్న ఏషియన్ హాస్పిటల్లో ఈ నెల 19న ఉచిత లివర్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించనున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నైకు చెందిన గ్లెనీగల్స్ గ్లోబల్ హెల్త్ సిటీ, ఏషియన్ హాస్పిటల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ఉచిత మెగా క్యాంపులో హెల్త్ సిటీకి చెందిన లివర్ ప్లాంటేషన్ నిపుణులు పీవీ రజనీకాంత్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ మానస మన్నే వైద్య పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. ఈ శిబిరంలో పచ్చ కామెర్లు, రక్తపు వాంతులు, రక్త విరేచనాలు, ప్యాంక్రియాటిక్ క్యాన్సర్, ఆల్కహాలిక్ లివర్ వ్యాధులు, హెపటైటిస్ బి, సి, ఫ్యాటీ లివర్ వ్యాధులకు చికిత్స చేస్తారని వివరించారు. పూర్తి వివరాలకు శ్రీనివాసరావు (9384880107)ను సంప్రదించాలని సూచించారు.

226 మంది విద్యార్థుల గైర్హాజరు

ఒంగోలు: పదో తరగతి సోషల్ పరీక్షకు 226 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 28968 మంది విద్యార్థులకు గాను 28742 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్, గుంటూరు ఆర్‌జేడీ వీఎస్ సుబ్బారావు కంభం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల కేంద్రాన్ని తనిఖీ చేశారు. పదో తరగతి పరీక్షల నిర్వహణ జిల్లా పరిశీలకుడు ప్రసన్నకుమార్ సంతనూతలపాడు ఎంఎస్‌ఆర్ జూనియర్ కాలేజీ, సంతనూతలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దర్శి సెయింట్ జేవియర్స్, చీమకుర్తి ప్రభుత్వ జూనియర్ కాలేజీ, దర్శి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, దర్శి ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల పరీక్షా కేంద్రాలను తనిఖీచేశారు. మరో వైపు జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ ఒక కేంద్రాన్ని తనిఖీ చేయగా స్క్వాడ్ బృందాలు 60 పరీక్షా కేంద్రాలను తనిఖీచేశారు. సోషల్ పరీక్షలో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ పి.రమేష్ తెలిపారు.

చేనేతలకు మేలు చేసింది జగనన్నే

- పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ విజయలక్ష్మి


విజయలక్ష్మికి పుష్పగుచ్ఛాలు అందిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల: సంక్షోభంలో ఉన్న చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకుచ్చి చేనేతలకు ఎనలేని మేలు చేసింది సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ విజయలక్ష్మి అన్నారు. 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి శనివారంఆమె చీరాల పర్యటనకు వచ్చారు. పట్టణంలోని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు నివాసంలో ఆమెను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ మర్యాద పూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందించారు. నియోజకవర్గంలో చేనేతలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ఆమెకు వివరించారు. అలానే చేనేతలు నేసే మగ్గాలను కార్పొరేషన్ చైర్మన్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ హయాంలో చేనేతలకు చంద్రబాబు తీవ్ర అన్యాయం చేస్తే..అధికారం చేపట్టినప్పటి నుంచే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షోభంలో ఉన్న చేనేత రంగానికి జవసత్వాలు తీసుకువచ్చి చేనేతరంగం అభివృద్ధికి కృషి చేశారన్నారు. మగ్గం ఉన్న ప్రతీ చేనేత కార్మికుడికి నేతన్న నేస్తం పథకంలో ఏడాదికి రూ.24 వేలు అందించడంతో పాటు చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించారన్నారు. చేనేతలకు వైఎస్సార్ సీపీ అన్నీ విధాల అండగా నిలిచి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. చేనేతలంతా వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ మెంబర్ అవ్వారు ముసలయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు జగదీష్, స్వాతి, చేనేత నాయకులు శ్రీకృష్ణ, తదితరులు ఉన్నారు.

ఘనంగా గంగమ్మతల్లి తిరునాళ్ల


గంగమ్మతల్లికి పూజలు చేస్తున్న దృశ్యం

మద్దిపాడు: మండలంలోని చిమట గ్రామ శివారులో వేంచేసిన శ్రీ గంగమ్మ తల్లి తిరునాళ్ల శనివారం ఘనంగా నిర్వహించారు. పూజారి కోడిపిల్ల వెంకటేశ్వర్లు అమ్మవారిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. సేవాసంఘ సభ్యులు భక్తులకు మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. భక్తులకు పులిహోర, పొంగళ్లను పంచిపెట్టారు. స్థానిక ఎస్ఐ పి. అంకమ్మరావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్త్ నిర్వహించారు.


ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలు

ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత

- పరీక్ష కేంద్రంలోనే వాంతులు, విరేచనాలు
- 108 చికిత్సలో అదుపు కాకపోవడంతో కనిగిరి ఆస్పత్రికి తరలింపు


విద్యార్థులకు 108లో చికిత్స చేయిస్తున్న అధికారులు

కనిగిరి రూరల్: మండలంలోని కంచర్లవారిపల్లి పరీక్షా కేంద్రం (ఏ) లో ఇద్దరు విద్యార్థులకు కడుపునొప్పి, వాంతులు, విరోచనాలు కావడంతో అస్పత్రికి తరలించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..శనివారం కంచర్లవారిపల్లి హాస్టల్ విద్యార్థి గురువిష్ణు, లింగారెడ్డిపల్లికి చెందిన నందులు పరీక్షకు వెళ్లే ముందు బయట హోటల్‌లో టిఫిన్ చేశారు. పరీక్షలు రాసే సమయంలో సుమారు 10.45 గంటలకు ఇద్దరు విద్యార్థులకు కడుపునొప్పి, వాంతులు, విరోచనాలు ప్రారంభమయ్యాయి. కేంద్రంలోని హెల్త్ సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసినా అదుపు కాలేదు. దీంతో 108 వాహనానికి సమాచారం పిలిపించి కేంద్రం వద్దే వైద్య సిబ్బందితో సెలైన్ ఎక్కించి వైద్య చికిత్సలు చేశారు. అయినా అదుపు కాలేదు. దీంతో పరీక్షా కేంద్ర చీఫ్, డీఓ, ఇతర అధికారులు ఇద్దరు విద్యార్థులతో డిక్లరేషన్ సంతకాలు పెట్టించుకుని మెరుగైన వైద్యం నిమిత్తం కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం విద్యార్థుల పరిస్థితి ఆరోగ్యంగా బాగానే ఉందని ఇంటికి వెళ్లారని ఎంఈఓ జె.ప్రసాద్‌రావు, జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి దేవిరెడ్డి రామిరెడ్డి తెలిపారు.

అదుపుతప్పి ఆర్టీసీ బస్సు బోల్తా


బోల్తా పడి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ముండ్లమూరు: అదుపుతప్పి ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఈ సంఘటన మండలంలోని పసుపుగల్లు వద్ద శనివారం తెల్లవారుజామున జరిగింది. వివరాల్లోకి వెళితే..అద్దంకి డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు శనివారం తెల్లవారుజామున దర్శి నుంచి అద్దంకి వెళుతుంది. మార్గమధ్యంలో దర్శి – అద్దంకి ప్రధాన రహదారిలో పసుపుగల్లు సాయి బాబా గుడి వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడి రోడ్డు పక్కన ఉన్న 11 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగింది. విద్యుత్ వైరు తెగకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదంలో 9 మందికి స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ పిచ్చయ్య, కండక్టర్ వెంకటేశ్వర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారంచేడుకి చెందిన మహిళకు నడుము వద్ద ఒత్తుకోవడంతో 108 వాహనంలో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అటెండర్ ఆత్మహత్య


నందబాల సాయి (ఫైల్)

ఒంగోలు టౌన్: స్థానిక డీఈవో కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న వారుగొండ నందబాలసాయి (39) వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని గానుగపాలేనికి చెందిన నందబాలసాయికి నెల్లూరు మధురానగర్‌కు చెందిన స్రవంతితో వివాహం జరగ్గా, ఆరేళ్ల కుమార్తె ఉంది. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మరణించాడు. బంధువులు ఇంటి తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా, అప్పటికే మృతిచెంది ఉన్నాడు. మృతుడి మేనమామ బత్తిన గురవయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. విచారణ జరిపి న్యాయం చేయాలని మృతుడి మేనమామ గురవయ్య ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆటో, బొలేరో ఢీ

ముండ్లమూరు: మండలంలోని పోలవరం– శంకరాపురం గ్రామాల మధ్య ఆటో – బొలేరో వాహనం ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురికి గాయాలయ్యాయి. మండలంలోని పసుపుగల్లు ఎస్సీ కాలనీకి చెందిన వారు అద్దంకిలో జరిగే ప్రార్థనా కార్యక్రమానికి శనివారం రాత్రి ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యంలో దర్శి– అద్దంకి ప్రధాన రహదారిలో పోలవరం క్రాస్ రోడ్డు దాటగానే ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న వరగాని పెదగురుమూర్తి, పెద కోటమ్మ, చిన కోటమ్మ, మరియమ్మ, యేసమ్మ, సుమతిలకు గాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న పోలవరం వైఎస్సార్ సీపీ నాయకులు సుబ్బారెడ్డి ప్రమాదంలో గాయపడిన వారిని 108 వాహనంలోకి ఎక్కించి అద్దంకి పంపి మానవత్వం చాటుకున్నారు.